అభివృద్ధే ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలోఅభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో రూ.4.58కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మున్సిపల్‌ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ చైర్మన్‌ రాములుగౌడ్‌, మాజీ సర్పంచ్‌లు సోమిరెడ్డి, లక్ష్మణ్‌, స్వామిగౌడ్‌, రాములుయాదవ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ బుచ్చిరెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు బాలాజీ, శ్రీశైలం, నాగరాజు, రవీందర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌యాదవ్‌, నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి, జంగారెడ్డి ఉన్నారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన బీఆర్‌యస్‌ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బీఆర్‌యస్‌ నాయకురాలు ప్రీతి, సీనియర్‌ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావుల ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌టిఆర్‌నగర్‌ కమాన్‌ వద్ద బీఆర్‌యస్‌ పార్టీ రజతోత్సవ మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో జరిగే మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

చెత్తకు నిప్పంటుకుని ఎగిసిపడ్డ మంటలు

భయాందోళనలో స్థానికులు



భీమునికుంట సమీపంలో మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధి జలవాయువిహార్‌ కాలనీకి ఆనుకొని ఉన్న భీమునికుంట చెరువులో చెత్తకు నిప్పంటుకుని మంటలు రేగాయి. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించటంతో స్థానికులు భయాందోళన చెందారు. జలవాయు విహార్‌ కాలనీవాసులు ఫైర్‌, ఎలక్ట్రికల్‌ అధికారులకు, మండల అధికారులకు సమాచారం అందించటంతో సిబ్బంది చేరుకున్నారు. ఫైర్‌ అధికారులు మంటలను ఆర్పివేశారు. స్థానికంగా స్తంభాలకు ఉన్న కేబుల్‌ వైర్లు కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకపోవటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. స్థానికంగా సబ్‌స్టేషన్‌ ఉండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దఎత్తున ప్రాణనష్టం వాటిల్లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు చుట్టూ.. కాలనీ చుట్టూ ఉన్న చెత్తా చెదారాన్ని దూర ప్రాంతానికి తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బహుమతులు అందజేత



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్‌ యూనిట్‌లో సీఐఎస్‌ఎఫ్‌ అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌ మాక్‌ డ్రిల్‌ నిర్వహించారు.కార్యక్రమంలో జీఎం విజయసాగర్‌, సీఐఎస్‌ఎఫ్‌ కమాండెంట్‌ మంజీత్‌ కుమార్‌, ఎస్‌డీజీఎం అరవింద్‌కుమార్‌, ఇన్‌స్పెక్టర్‌ బి.ఎస్‌.భండారిలు పాల్గొన్నారు.

మసకబారిన మస్క కుంట



ప్లాస్టిక్‌ వ్యర్థాలు, చెత్త చెదారం, మురుగుమయం

చందానగర్‌: మస్కకుంట చెరువును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చెరువులోకి భారీగా మురుగునీటితో పాటు చెత్త చెదారం వేస్తుండడంతో మురుగుమయంగా మారింది. దుర్వాసన వెదజల్లుతోంది. ఈ చెరువులో భవన నిర్మాణ వ్యర్థాలు పోస్తుండడంతో చెరువు అస్తవ్యస్తంగా తయారైంది. ఇక వర్షాకాలంలో చెరువు నిండిపోయి ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌ సాయికాలనీ ముంపునకు గురవుతోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉన్న చెరువులు, కుంటలను వివిధ స్వచ్ఛంద సంస్థలు, సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌తో అభివృద్ధి చేస్తున్నారు. మస్కకుంట పక్కనే ఉన్న కాయిదమ్మకుంట చెరువు పనులు ప్రారంభమయ్యాయి. కాగా ఈ చెరువుల పక్కనే ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయి. ఈ రెండు చెరువుల మధ్య ఇళ్లు ఉండడంతో దుర్వాసన, దోమల బెడద భరించలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు మస్కకుంటను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఇప్పటికే చందానగర్‌, హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని భక్షికుంట, కొత్తకుంట చెరువుల సుందరీకరణ పూర్తయింది.



మురుగునీటితో నిండిన చెరువు

మురుగునీరు రాకుండా చూడాలి



మస్కకుంట చెరువు దుర్గంధం వెదజల్లుతుంది. దోమల బెడద ఎక్కువైంది. పిల్లలకు జ్వరాలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే చెరువులోకి మురుగు నీరు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– మహేష్‌గౌడ్‌, సాయినగర్‌

చెరువును అభివృద్ధి చేయండి



హఫీజ్‌పేట్‌లోని మస్కకుంటను అభివృద్ధి చేయాలి. రోజురోజుకు చెరువు తగ్గిపోతోంది. ఫెన్సింగ్‌తో పాటు వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించాలి. చెరువును శుభ్రం చేయించాలి. చెరువులో దోమల మందు పిచికారీ చేయించాలి.

– శివాజీ, సాయినగర్‌



చెరువులో ప్లాస్టిక్‌ వ్యర్థాలు

ఉర్దూ యూనివర్సిటీ ఎంఈడబ్ల్యూఏ నూతన కార్యవర్గం



రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ (ఎంఈడబ్ల్యూఏ) నూతన కార్యవర్గం సోమవారం వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ను, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌ను సోమవారం కలిసింది. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన అధ్యక్షుడుగా షేక్‌ నవీద్‌ , ఉపాధ్యక్షుడిగా ధరమ్‌జీత్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్‌ షానవాజ్‌ అలీ ఖురేషీ, సంయుక్త కార్యదర్శగా ఎంఏనవాజ్‌, కార్యదర్శిగా సయ్యద్‌ గౌస్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీగా సయ్యద్‌ యూసుఫ్‌రజ్వీ, కోశాధికారిగా రజాక్‌ షరీఫ్‌, కార్యవర్గసభ్యులుగా మహ్మద్‌ జావేద్‌, ఎంఏఖయ్యూమ్‌బాబా ఎన్నికయ్యారు.

సామాజిక సేవ సంతృప్తినిస్తుంది

చందానగర్‌: కొండాపూర్‌ సీఆర్‌ ఫౌండేషన్‌లో హోమ్‌ ఫర్‌ ఏజ్డ్‌ వద్ద మల్లంపాటి సోదరుల ఆర్థిక సహాయంతో సిమెంట్‌ రోడ్డు నిర్మించారు. సోమవారం సీఆర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షులు డాక్టర్‌ నారాయణ సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగస్త్య ఆగ్రో లిమిటెడ్‌ ఎండీ మల్లంపాటి మురళి, రిటైర్డ్‌ సైంటిస్ట్‌ మల్లంపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలలో పాలుపంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. అనంతరం డాక్టర్‌ నారాయణ, పల్లా వెంకటరెడ్డిలు మల్లంపాటి సోదరులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చెన్నమనేని వెంకటేశ్వరరావు, చెన్నకేశవరావు, సీఆర్‌ పాలీక్లినిక్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కూనంనేని రజని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్‌ జ్యోసభట్ల కల్పన, సభ్యులు లలిత, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డాక్టర్‌ నారాయణ తదితరులు

'స్పార్క్స్‌' మెగా ఆర్ట్‌ అండ్‌ సైన్స్‌ ఫెస్టివల్‌





గచ్చిబౌలి: చిరెక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో స్పార్క్స్‌ పేరిట నిర్వహించిన మెగా ఆర్ట్‌ అండ్‌ సైన్స్‌ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొండాపూర్‌లోని చిరెక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో కార్నివాల్‌ సందడి నెలకొంది. సైన్స్‌ ప్రదర్శనలు, ఇంటరాక్టివ్‌ సెషన్‌లు, రోబో వర్క్‌షాపులు, సాకర్‌, షూటింగ్‌, విలువిద్య వర్క్‌షాపులు, పెయింటింగ్‌, బంక మట్టితో కుండల తయారీ తదితర పోటీలలో విద్యార్థులు ప్రతిభను చాటారు. డిజిటల్‌ ఆర్ట్‌లో షోకేసులు ప్రదర్శించారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈవెంట్‌ ఎంతో దోహదం చేసిందని చిరెక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ సంచిత రాహ పేర్కొన్నారు.

23నుంచి జేఎన్‌వీలో దివ్యాంగుల ప్రతిభాన్వేషణ



రాయదుర్గం: శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌ నవోదయ విద్యాలయలో ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు దివ్యాంగ విద్యార్థులలో ప్రతిభాన్వేషణ్‌ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్‌ గోపాలకృష్ణ పర్యవేక్షణలో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో చండీఘడ్‌, పాట్నా, పూణే, భోపాల్‌, హైదరాబాద్‌ రీజియన్‌లోని జవహర్‌ నవోదయ విద్యాలయాల నుంచి 160 మంది దివ్యాంగ బాలబాలికలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌ రెజిలింగ్‌, సైక్లింగ్‌, స్విమ్మింగ్‌, తైక్వాండో, షూటింగ్‌, బ్యాడ్మింటన్‌, ఆర్చరీ, జూడో, సిట్టింగ్‌ వాలీబాల్‌, అథ్లెటిక్స్‌ నిర్వహించనున్నారు. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని డీసీ గోపాలకృష్ణ తెలిపారు.

'మనూ' జాబ్‌మేళాలో 20 మంది ఎంపిక



నియామకపత్రాలను అందిస్తున్న టీపీసీ డైరెక్టర్‌ డాక్టర్‌ యూసుఫ్‌ఖాన్‌

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 20 మంది అభ్యర్థులకు ఆఫర్‌ లెటర్లు ఇవ్వగా మరో 45 మంది పేర్లు నమోదు చేయడం జరిగిందని 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్‌ సెల్‌(టీపీసీ) డైరెక్టర్‌ డాక్టర్‌ మహ్మద్‌ యూసుఫ్‌ఖాన్‌ వెల్లడించారు. సోమవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని టీపీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వందమందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

18 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రూ.1500 జరిమానా, నలుగురికి రూ.2 వేలు జరిమానా, ఆరుగురికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

రేకుల షెడ్‌ కూల్చివేత



మాదాపూర్‌: ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రే అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మాదాపూర్‌లోని ఖానామెట్‌ విలేజ్‌లో 41/14లో షెడ్‌ నిర్మించినట్టు సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. గతంలో కూడా ఇలాగే నిర్మించారని పేర్కొన్నారు. దాదాపు 500 నుంచి 600 గజాల వరకు అక్రమంగా ఆక్రమించినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కూల్చివేతలలో ఆర్‌ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మణికొండ: ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అపుడపుడు అన్ని రకాల వైద్య పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ పరిధి డాక్టర్‌ వైఎస్సార్‌ సెక్రటేరియట్‌ ఎంప్లాయిస్‌ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజు అన్నారు. కాలనీలో శ్రీ త్రికూటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆశ్రయ్‌ ఆకృతి స్వచ్ఛంద సంస్థ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

పోషకాహారంతోనే ఆరోగ్య సమాజం

ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ ఆర్‌జేడీ మోతి

మణికొండ: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకున్నపుడే రాబోయే సమాజం ఆరోగ్యకరంగా మరింత ఉత్తమంగా రూపొందుతుందని ఐసీడీఎస్‌ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్‌ ఆర్‌జేడీ మోతీ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్‌ కేంద్రంలోని అంబేడ్కర్‌ భవన్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోతీ అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు పోషకాహార ఫలితాలను మెరుగుపర్చటం, పోషకాహార లోపాలను సరిచేయటం, వాటిపై అవగాహన పెంచటానికి ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్‌ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులకు కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల ప్రాముఖ్యతను వివరించారు. మాజీ కౌన్సిలర్‌ ఉషారాణి, మండల అంగన్‌వాడీ టీచర్‌ సంఘం అధ్యక్షురాలు సుధారాణి, ఆర్‌పీ జాను, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.



సామూహిక సీమంతం

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి

గచ్చిబౌలి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి ఆదేశించారు. సోమవారం జోనల్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వెస్ట్‌ జోనల్‌లో 8, యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 5, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 11, చందానగర్‌ సర్కిల్‌లో 3 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి

హెచ్‌సీయూ విద్యార్థులకు అరుదైన అవకాశం

రాయదుర్గం: స్పార్క్‌ ప్రాజెక్టులో భాగంగా హెచ్‌సీయూ డాక్టోరల్‌ విద్యార్థులు క్వీన్స్‌ల్యాండ్‌ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. హెచ్‌సీయూలోని ప్రొఫెసర్‌ కాంచన్‌ కె మాలిక్‌, ట్రీసారీనా జాన్‌ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న వంశీకృష్ణ, హెచ్‌సీయూ కమ్యూనికేషన్‌ విభాగానికి చెందిన ఇద్దరు పరిశోధక విద్యార్థులు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లోని క్వీన్స్‌ల్యాండ్‌ విశ్వవిద్యాలయ సందర్శన సోమవారంతో ముగిసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు కమ్యూనిటీ రేడియో స్టేషన్‌లను సందర్శించారు. ఆదివాసీ, టోర్రెస్‌ స్ట్రెయిట్‌ ద్వీపవాసుల కమ్యూనిటీలకు స్వదేశీ కార్యక్రమాలు అర్థం చేసుకోవడానికి ఎలా ఉపయోగపడిందో తెలుసుకున్నారు.



రోడ్డు బాగు చేయించాలని వినతి

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు నుండి ఇంద్రేశం పెద్ద కంజర్ల మీదుగా దౌల్తాబాద్‌ వెళ్లే రహదారి టిప్పర్లు, లారీలు తిరగడంతో పాడైందని స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారని, కొత్త రోడ్డు వేయాలని అదనపు కలెక్టర్‌కు సోమవారం బీజేపీ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. గుంతల రోడ్డు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం, జిల్లా నాయకులు అల్లం రాజిరెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు రవీందర్‌, మండల ఉపాధ్యక్షులు ధనుంజయగౌడ్‌, సీనియర్‌ నాయకులు విష్ణువర్ధన్‌, బూత్‌ అధ్యక్షులు నవీన్‌కుమార్‌, భరత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగిలో మంచినీటి సమస్య

తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధి ముత్తంగిలో గత 45 రోజుల నుండి మంచినీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అదనపు కలెక్టర్‌కు ముత్తంగివాసులు వివరించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మంజీరా నీటి పైపులు పగలడంతో ముత్తంగికి మంచి నీరు రావడం లేదని ఈ విషయంను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని తెలిపారు.

భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలి

సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్‌: మియాపూర్‌ నుండి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ..మియాపూర్‌- సంగారెడ్డి చౌరస్తా వరకు రూ .1350 కోట్లతో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఇందులో రూ .700 కోట్లు రహదారి నిర్మాణానికి, రూ.650 కోట్లు ఆస్తులు కోల్పోతున్న వారికి నేషనల్‌ హైవే సంస్థ కేటాయించిందని చెప్పారు. భూములు కోల్పోతున్న వారు నష్టపరిహారం చెల్లించకపోవడంతో ఏ అధికారులను కలవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా నష్టపరిహారం సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌, రాములు,మహేందర్‌ రెడ్డి,విజయభాస్కర్‌, కుమ్మరి చంద్రయ్య, ప్రహ్లాదరెడ్డి, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

సమస్యల పరిష్కారం దిశగా సాగాలి



సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. సమస్యల పట్ల అధికారులు నిర్లిప్తతను వీడాలని, ప్రజల నుంచి మీ దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించాలని సూచించారు. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌, వివేకానందనగర్‌, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్‌యంసీ, ఇంజనీరింగ్‌ విభాగం, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణనలోకి తీసుకుని త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్‌ విభాగం అధికారులు ఈఈ గోవర్ధన్‌ గౌడ్‌, డీఈలు రమేష్‌, నిఖిల్‌, ఏఈలు రాజీవ్‌, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కంచె కరువాయే..!

- ప్రమాదకరంగా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లు
- బిక్కుబిక్కుమంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

మోతీనగర్‌: మూసాపేట, అల్లాపూర్‌ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీలు, ఇళ్ల మధ్య, రోడ్ల పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ కంచె లేకపోవడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మూసాపేట డివిజన్‌ బబ్బుగూడ అవంతినగర్‌తోట, కబీర్‌నగర్‌, పాండురంగానగర్‌, అల్లాపూర్‌ డివిజన్‌లోని వి.రామారావునగర్‌, గణేశ్‌నగర్‌, శ్రీ వివేకానందనగర్‌, పర్వత్‌నగర్‌తో పాటు పలు బస్తీల్లో ఇళ్ల మధ్యనే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటి తీగలు, స్విచ్‌లు, ఫీజు బాక్సులు అధిక లోడు వంటి కారణాలతో నిప్పురవ్వలు బయటకు వచ్చి పక్కనే ఉన్న ప్లాస్టిక్‌ వస్తువుల, ట్యూబులు, టైర్లపై పడితే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వివేకానందనగర్‌లో..



మోతీనగర్‌ ప్రధాన రోడ్డు సమీపంలో ..